క్లుప్తంగా

రేపు మున్సిపల్ కార్యాలయంలో గ్రీవెన్స్



మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి

జంగారెడ్డిగూడెం: మున్సిపల్ కార్యాలయంలో ఈ నెల 17న గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక చైర్‌పర్సన్ చాంబర్‌లో మున్సిపాలిటీ పరిధిలోని ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించబడతాయన్నారు. తాగునీరు, శానిటేషన్, భూ అక్రమణలు, తదితర సమస్యలపై వినతులు స్వీకరిస్తామన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు పాల్గొంటారన్నారు.

దత్తాత్రేయ స్వామికి అభిషేకం



విశేష అలంకరణలో దత్తాత్రేయ స్వామి

జంగారెడ్డిగూడెం: మండలంలోని గురవాయిగూడెం గ్రామంలో వేంచేసియున్న శ్రీహరిహర సుత అయ్యప్పస్వామి దేవస్థానంలో శ్రీదత్తాత్రేయ స్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రోడ్లు పరిశుభ్రంగా ఉంచాలి



ఎస్‌డబ్ల్యు పీసీ షెడ్‌ను పరిశీలిస్తున్న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ జిల్లా కో–ఆర్డినేటర్

చింతలపూడి: గ్రామంలో తడి చెత్త పొడి చెత్తను వేరువేరుగా సేకరించాలని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ జిల్లా కో–ఆర్డినేటర్ ప్రసంగరాజు ఆదేశించారు. గురువారం చింతలపూడి మండలం, ఎర్రంపల్లి, ప్రగడవరం గ్రామాల్లో ఎస్‌డబ్ల్యూ పీసీ షెడ్లను ఆయన పరిశీలించారు. గ్రామాల్లో రోడ్ల పక్కన చెత్తకుప్పలు, పెంట కుప్పలు లేకుండా రోడ్లు శుభ్రంగా ఉండేలా చూడాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా వర్మీకంపోస్ట్ ప్రాసెస్ యూనిట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కె.రత్నకుమార్, పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

అపర భగీరథుడికి ఘన నివాళి



కాటన్ మహాశయునికి నివాళులర్పిస్తున్న చిన్నారులు

కొయ్యలగూడెం: అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ జయంతిని లైబ్రరీలో గురువారం నిర్వహించారు. సమ్మర్ శిబిరాలకు హాజరవుతున్న విద్యార్థులు కాటన్ చిత్ర పటానికి లైబ్రరీ రాముడు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. స్పందన స్వచ్ఛంద సంస్థ గౌరవ అధ్యక్షుడు బలుసు నాగేశ్వరరావు మాట్లాడుతూ కాటన్‌దొర కోస్తా జిల్లాలకు అన్నదాత వంటి వారన్నారు. కార్యక్రమంలో మేకల అన్నవరం, 20 మంది విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

భూ పోరాటాలకు పేదలు సిద్ధమవ్వాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎ.రవి

జంగారెడ్డిగూడెం: రాష్ట్ర ప్రభుత్వం ఎర్రకాలువ ప్రాజెక్టు మిగులు భూములు, ల్యాండ్ సీలింగ్ ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి జీవరత్నం, జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ జిల్లాలోని లక్షలాది ఎకరాల ప్రభుత్వ భూములు భూస్వాముల ఆక్రమణలో ఉన్నాయని వాటిని తక్షణమే పేదలకు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు అందుగుల ప్రభాకర్‌రావు, జి.సూర్యకిరణ్, యాగంటి సీత, వామిశెట్టి నరసరావు, బుద్దుల గంగాభవాని, ఎం.బాలరాజు, ఎం.అశోక్‌కుమార్, కె.సుబ్బారావు, కె.ఏసు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గిత్త మృతి

కుక్కునూరు: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తున్న గిత్త ఎర్త్‌వైర్‌కు తాకి విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన గురువారం మండలంలోని కమ్మరిగూడెం గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, కమ్మరి గూడెం గ్రామానికి చెందిన రైతు చిలకాల సూర్యనారాయణకు చెందిన గిత్త ట్రాన్స్‌ఫార్మ ర్ వద్ద మేత మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏర్పాటు చేసిన ఎర్త్‌వైర్‌కు గిత్త కాలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్టు చెప్పారు.

మెట్టలో అంతరిస్తున్న జీడి మామిడి

- ఏటా పెరుగుతున్న నష్టాలు
- క్రమంగా తోటలను తొలగిస్తున్న రైతులు
- ప్రభుత్వం రాయితీ కల్పించాలని వేడుకోలు



మెట్ట ప్రాంతంలో విస్తరించి ఉన్న జీడి తోట



మెట్ట ప్రాంతంలో జీడి చెట్లకు గుత్తులుగా కాస్తున్న జీడి గింజలు

చింతలపూడి: ఏటా మెట్ట రైతులకు కోట్లాది రూపాయల రాబడిని ఆర్జించి పెట్టిన జీడి మామిడి తోటలు ప్రస్తుతం అంతరించి పోతున్నాయి. ఏటా సంభవిస్తున్న వాతావరణ మార్పుల కారణంగా ఒక ఏడాది లాభాలు వస్తే రెండేళ్ల నష్టాలను చవి చూసేవారు రైతులు. దీంతో గత పదేళ్లుగా జీడి తోటలను తొలగించి ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించారు. ముఖ్యంగా పామాయిల్, మొక్కజొన్న, వేరుశనగ, అరటి పంటలను ఎక్కువగా పండిస్తున్నారు. అంతే కాకుండా మెట్ట ప్రాంతంలో భూగర్భ జలాల వినియోగం పెరిగాక వాణిజ్య పంటల విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. చింతలపూడి సబ్ డివిజన్‌లో ఒకప్పుడు వేలాది ఎకరాల్లో విస్తరించి ఉన్న జీడి తోటలు ప్రస్తుతం రెండు వేల హెక్టార్లకు చేరుకున్నాయి. ప్రస్తుతం జీడి పిక్కల బస్తా రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు ఉంది.

విదేశీ ఎగుమతులపై అవగాహన లేదు

సహజంగా జీడి తోటల పెంపకం వలన రైతులకు అనేక రకాలుగా ఆదాయం లభిస్తుంది. మన ప్రాంతంలో రైతులు జీడి పిక్కలను మాత్రమే సేకరిస్తారు. జీడి పండ్లను చెట్ల కిందే వదిలేస్తారు. అదే ఇతర రాష్ట్రాల్లో అయితే అక్కడి రైతులు పండ్లను కూడా సేకరించి ఆదాయం పొందుతున్నారు. వీటితో జామ్, పండ్ల రసాలు, తయారు చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. విదేశీ ఎగుమతులపై ఇక్కడి రైతులకు అవగాహన లేదు. ఏటా ఇక్కడి నుంచి కమీషన్ దారులు లారీల్లో జీడి పిక్కలను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. ప్రస్తుతం ఉన్న తోటలను కాపాడుకోవడంతో పాటు కొత్తగా తోటలు వేసుకునే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే మెట్ట ప్రాంతంలో జీడి తోటల విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.

జీడి తోటలకు రాయితీ ఇవ్వాలి



మెట్ట ప్రాంతంలో జీడితోటల అభివృద్ధికి ప్రభుత్వం రాయితీలు అందించాలి. ముదురు చెట్లు చెలుపు తీయడానికి కూడా ప్రభుత్వ సహకారం అందించాలి. లేకపోతే జీడి తోటలు అంతరించిపోయే ప్రమాదం ఉంది. దీంతో పాటు మార్కెట్‌లో జీడి రైతులకు గిట్టు బాటు ధర కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

యర్రంశెట్టి రామకృష్ణారావు, రైతు, నామవరం

దొంగతనం కేసు నమోదు

కామవరపుకోట: మేకలు దొంగలించి తీసుకెళుతుండగా వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తడికలపూడి ఎస్సై పి.చెన్నారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం మండలం అక్కంపాలెం గ్రామానికి చెందిన బల్లే విజయ్ కుమార్ 12వ తేదీ రాత్రి కామవరపుకోట కొత్తూరు సబ్‌స్టేషన్ సమీపంలో గల బట్టా సత్యనారాయణ ఇంటి ఆవరణలో ఉన్న 20 మేకల్లో ఒక మేకను దొంగిలించి బుధవారం ఏలూరు వైపు తీసుకువెళుతుండగా తడికలపూడి శివారులో అతడిని పట్టుకుని కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

చింతలపూడి: మండలంలోని ప్రగడవరం సొసైటీ గోడౌన్ సమీపంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ప్రమాదం జరిగింది. స్థానికులు వెంటనే స్పందించి అంబులెన్సులో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా గాయపడ్డ యువకుడు దేశవరం గ్రామానికి చెందిన వ్యక్తిగా భావిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. యువకుడికి ప్రభుత్వాసుపత్రి వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



చింతలపూడి: పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ అధికారులు



జంగారెడ్డిగూడెం: పంగిడిగూడెంలో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

చింతలపూడి: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో గురువారం దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ పి.అశోక్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని టి.నరసాపురం మండలం తెడ్లం గ్రామంలో కోరుకొండ దుర్గయ్య, వద్ద 3 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని, అతడికి సారా సరఫరా చేసిన రెమాలి రాజుపై కేసు నమోదు చేశామన్నారు. బొర్రంపాలెంలో నాటు సారా స్థావరంపై దాడి చేసి వీరముల్ల దేవి మంగరాజు వద్ద 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని, అతడికి సారా సరఫరా చేసిన మరీదు మంగరాజుపై కూడా కేసు నమోదు చేశామన్నారు. వల్లంపట్ల గ్రామంలో బాలిన శివకృష్ణకు చెందిన 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, కేసు నమోదు చేశామన్నారు. చింతలపూడి మండలంలో పాత సారా కేసులో బెల్లం సరఫరా చేసిన నిందితుడు జల్లు పార్థ శేషగిరిరావును ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ వద్ద హాజరు పరచగా బైండోవర్‌ను ఉల్లంఘినందుకు అతడికి రూ.1.75 లక్షల జరిమానా విధించినట్లు చెప్పారు. వీరమల్లదేవి మంగరాజును టి.నరసాపురం మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌వద్ద హాజరు పరిచి బైండోవర్ చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఈఎస్‌టీఎఫ్ ఏలూరు ఎస్సై ఎండీ ఆరీఫ్, చింతలపూడి ఎక్సైజ్ ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, జె.జగ్గారావు, సిబ్బంది పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో గురువారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. మండలంలోని పంగిడిగూడెంలో మేడంకి వీరప్రతాప్‌ను అరెస్టు చేసి అతడి వద్ద నుంచి 5 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, అతడిపై కేసు నమోదు చేశామని సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. అదేవిధంగా ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ స్క్వాడ్ వారు దేవులపల్లిలో దాడులు నిర్వహించి, ఐదు లీటర్ల సారాతో మిడత సీతను అరెస్టు చేసి, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది, ఎక్సైజ్ ఎస్సైలు పాల్గొన్నారు.

ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని కోరుతూ రిలే దీక్ష



రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న శ్రీనివాస్

బుట్టాయగూడెం: షెడ్యూల్ ప్రాంతంలో ఉద్యోగ నియామకాల చట్టం ఏర్పాటు చేయాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు మడకం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి తన హామీ నెరవేర్చాలంటే షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం ఒకటే మార్గమన్నారు. గిరిజన సలహా మండలి ఏర్పాటు చేసి గిరిజన ప్రాంతానికి స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలన్నారు. ఆదివాసీ అగ్రికల్చర్ కమిటీ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌లో షెడ్యూల్ ప్రాంత ఉద్యోగులను స్పెషల్ డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు మొడియం గంగరాజు, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు కారం రాఘవ, ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు కుంజం కృష్ణంరాజు, ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ నాయకులు తెల్లం శ్రీనుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు సంఘీభావం



కోటదిబ్బ ప్రాంతంలో సమ్మె విజయవంతం కోరుతూ ప్రచారం చేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 20న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెకు హేలాపురి ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ సంఘీభావం తెలుపుతున్నట్టు యూనియన్ అధ్యక్షులు లింగమల్లు శ్రీనివాసరావు తెలిపారు. గురువారం స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో నిర్వహించిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, మల్టీ నేషనల్ కంపెనీలకు కార్మిక వర్గాన్ని తాకట్టు పెట్టవద్దని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మిక బోర్డును పునరుద్ధరించి, కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో గౌరవాధ్యక్షుడు మైచర్ల శంకరరావు, సెక్రటరీ బత్తిన శ్రీనివాసరావు, ఆర్గనైజర్ సెక్రటరీ ఉమా సాయి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రాజ గోపుర ప్రతిష్ఠా మహోత్సవాలు



నూతనంగా నిర్మించిన రాజ గోపురం

కొయ్యలగూడెం: అంకాలగూడెం శ్రీఉమా సమేత భోగలింగేశ్వరస్వామి ఆలయం ఎదుట నూతనంగా నిర్మించిన రాజగోపుర శిఖర ప్రతిష్ఠా మహోత్సవాలు 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల్లో ప్రారంభం రోజున విఘ్నేశ్వర పూజ, అంకురారోహణ, ధ్వజారోహణ, శ్రీలక్ష్మీ గణపతి రుద్ర చండీ, ప్రాయశ్చిత్త హోమాలు నిర్వహించనున్నారు. 18వ తేదీ క్షీరాధివాసం, జలాధివాసం, భద్రకాళీ పీఠార్చన కార్యక్రమాలు ఉంటాయన్నారు. 19వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు శిఖర ప్రతిష్ఠాపనోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమాలు బ్రహ్మశ్రీ మామిళ్లపల్లి ఆనంద్ శివాచార్యుల పర్యవేక్షణలో నిర్వహించనున్నారు.

ఇంగ్లిష్ భాషపై ఆసక్తి పెంచుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

ఏలూరు (టూటౌన్): ఇంగ్లిష్ భాష నేర్చుకోవాలనుకునే వారు దానిపై అభిమానం, ఆసక్తి పెంచుకోవాలని సీఆర్ రెడ్డి డిగ్రీ కళాశాల ఇంగ్లిష్ రిటైర్డ్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ పి.ఆంజనేయులు సూచించారు. పవర్‌పేటలోని అన్నే భవన్‌లో ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసిన స్పోకెన్ ఇంగ్లిష్ ట్రైనింగ్ సెంటర్‌ను ఆంజనేయులు ప్రారంభించి మాట్లాడారు. భాషను సమయస్ఫూర్తిగా వినియోగించగలడం నేర్చుకోవాలన్నారు. ఏవీఆర్ జ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ శిక్షణ శిబిరాన్ని 10వ తరగతి, ఆ పైన చదివే విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. స్పోకెన్ ఇంగ్లిష్ ట్రైనర్ కేవీ నారాయణరావు ఇంగ్లిష్‌లో కొన్ని వాక్యాలను మాట్లాడటం నేర్పించారు. కార్యక్రమాన్ని విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు ఎమ్మెస్ ఎన్ లక్ష్మి, కొమోజి శ్రీనివాసరావు సమన్వయం చేశారు.

శ్రీవారి సేవలో సీఆర్‌పీఎఫ్ ఐజీ



సీఆర్‌పీఎఫ్ ఐజీ విక్రమ్‌కు శ్రీవారి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ డీఈఓ బాబురావు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని సీఆర్‌పీఎఫ్ ఐజీ విక్రమ్ తుంబళ్ల గురువారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ డీఈఓ బాబురావు, సూపరింటెండెంట్ రమణరాజు స్వామి వారి జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట భీమడోలు సీఐ యూజే విల్సన్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ కాలేజీని సందర్శించిన ఆర్‌ఐవో



విద్యార్థుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్‌ఐఓ యోహాన్

కామవరపుకోట: మండల కేంద్రమైన కామవరపుకోటలోని శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాలను ఆర్‌ఐవో యోహాన్ గురువారం సాయంత్రం సందర్శించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కాలేజీలో 2025–26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందా లేదా అన్నది పరిశీలించేందుకు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఫస్ట్ ఇయర్ అడ్మిషన్లు తీసుకొని కాలేజీని కొనసాగించాలన్నారు. ఈ క్రమంలో కాలేజీని క్షుణ్ణంగా పరిశీలించి, వివరాలను సేకరించారు. కళాశాలలో సౌకర్యాలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తానని ఆయన తెలిపారు.

తేలని స్త్రీనిధి నిధుల గోల్‌మాల్ వ్యవహారం

గణపవరం: మండలంలోని ముగ్గుళ్ల గ్రామంలో స్వయం సహాయక సంఘాలకు చెందిన స్త్రీనిధి నిధులు రూ.36 లక్షల గోల్‌మాల్ వ్యవహారం నెల రోజులు కావస్తున్నా నేటికీ కొలిక్కి రాకపోవడంతో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ సొమ్ము మాయమైందంటూ తొలుత కొందరు మహిళలు చేసిన ఆరోపణలపై నిర్వహించిన ప్రాథమిక విచారణలో రూ.16 లక్షలు వివోఏ వెంకటలక్ష్మి వాడుకున్నట్లు ఎపిఎం అమీరున్నీసా వెల్లడించారు. దీనిపై గణపవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో తాను వాడుకున్న సొమ్మును ఏప్రిల్ 15వ తేదీ లోగా చెల్లిస్తానని హామీ ఇచ్చిన వెంకటలక్ష్మి అప్పటినుంచి నేటివరకూ పరారీలోనే ఉండటంతో బాధితమహిళలు ఆందోళన చెందుతున్నారు. దీనితో మహిళలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులును కలిసి తమకు న్యాయం చేయాలని మొరపెట్టుకున్నారు. ఆయన ఈవిషయం జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధిత మహిళలకు న్యాయం చేయాలని కోరారు. అయినా ఇప్పటివరకూ తమకు న్యాయం జరుగలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు వెలగపల్లి గ్రామంలో స్త్రీనిధి నిధులు రూ.15 లక్షల గోల్‌మాల్ వ్యవహారం కూడా ఇంకా కొలిక్కి రాకపోవడంపట్ల పలువురు విమర్శిస్తున్నారు.

17 నుంచి జాతీయ స్థాయి తెలుగు నాటిక పోటీలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అంబికా సంస్థల వ్యవస్థాపకుడు దివంగత ఆలపాటి రామచంద్రరావు శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని అంబికా సంస్థలు, హిందూ యువజన సంఘం, హేలాపురి కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ ఆలపాటి రామచంద్రరావు జాతీయ స్థాయి తెలుగు నాటిక పోటీలు నెల 17, 18, 19, 20 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో గురువారం ఆహ్వాన పత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా అంబికా సంస్థల చైర్మన్ అంబికా కృష్ణ, వైఎంహెచ్‌ఏ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యర్రా సోమలింగేశ్వరరావు, కేవీ సత్యనారాయణ మాట్లాడుతూ స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి రెండు సాంఘిక నాటికలు ప్రదర్శిస్తారన్నారు. 17న విజయవాడకు చెందిన శ్రీ కృష్ణ తెలుగు థియేటర్స్ అనస్వరం నాటిక, తాడేపల్లి కుంచనపల్లికి చెందిన అరవింద్ ఆర్ట్స్ విడాకులు కావాలి నాటిక ప్రదర్శిస్తారని తెలిపారు. 18న హైదరాబాద్ గోవాడ క్రియేషన్స్ ఆధ్వర్యంలో అమ్మ చెక్కిన బొమ్మ నాటిక, గుడివాడ కృష్ణ ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ద్వారబంధాల చంద్రయ్య నాయుడు నాటిక ప్రదర్శిస్తారన్నారు. 19న హైదరాబాద్ యువభేరి థియేటర్ ఆర్గనైజేషన్ నా శత్రువు నాటిక, సహృదయ ద్రోణాదుల ఆధ్వర్యంలో వర్క్ ఫ్రం హోం నాటిక, 20న కొలకలూరు శ్రీ సాయి ఆర్ట్స్ జనరల్ భోగి నాటిక, వీరన్నపాలెం కళానికేతన్ రుతువు లేని కాలం అనే నాటిక ప్రదర్శనలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమానికి పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు అతిథులుగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. సంస్థ గౌరవ ఆహ్వానితులు వేణుగోపాల్ లునాని, ఎ.పార్వతీ రామచంద్రన్, మారం హనుమంతరావు, కానాల మురళీకృష్ణ, ఎం సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

లింగపాలెం: ధర్మాజీగూడెం సబ్‌స్టేషన్‌లో నూతన లైన్లు ఏర్పాటు చేస్తున్నందున ఈ నెల 16న విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రంగాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని పోచవరం ఫీడర్, రంగాపురం హెడ్ క్వార్టర్ ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వాసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా ప్రభుత్వం, అధికారులు కృషి చేయాలని ప్రగతి శీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు వెట్టి భారతి ఓ ప్రకటనలో కోరారు. గురువారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పోలవరం పీహెచ్‌సీలో జరిగిన గర్భిణి శిరీష మృతి వంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



చంద్రావతమ్మ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

కొయ్యలగూడెం: గవరవరం వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ చీమకుర్తి సత్యనారాయణ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు గురువారం పరామర్శించారు. సత్యనారాయణ తల్లి నాగచంద్రావతమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆయన నివాసానికి వెళ్లి చంద్రావతమ్మ చిత్రపటం వద్ద నాయకులతో కలిసి నివాళులర్పించారు.

ధర్మాజీగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారిగా నిఖిత



ధర్మాజీగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారిణిగా నిఖిత

లింగపాలెం: మండలంలోని ధర్మాజీగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారిణిగా నిఖిత బాధ్యతలు చేపట్టారు. ఈమె ఏలూరు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా నిఖిత మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి, వైద్య సేవలు అందిస్తానన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని నిఖిత కోరారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ తరగతులు



గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు

లింగపాలెం: ధర్మాజీగూడెం శాఖా గ్రంథాలయంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. గురువారం విద్యార్థులకు దశావతారాల్లో మూడోదైన వరాహావతారం గురించి గ్రంథాలయ అధికారి సీహెచ్‌వీ రమణ వివరించారు. అనంతరం విద్యార్థులచే వారికి నచ్చిన పుస్తకాలు చదివించడం, పుస్తక సమీక్ష కార్యక్రమాన్ని నిర్వహించినట్లు రమణ తెలిపారు. ఏవీ నారాయణ మేథ్స్‌లో తర్ఫీదు ఇచ్చారు. పలు రకాల యోగాసనాలు నేర్పించారు. విద్యార్థులచే కేరమ్స్, మైండ్ మెమరీ గేమ్స్ ఆడించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి, విద్యార్థులు 14 మంది పాల్గొన్నారు.